www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 మే 2023
5
అన్నమయ్య



13న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి కేశవ



పోలీసులకు సూచనలు చేస్తున్న జడ్జి కేశవ

రాజంపేట అర్బన్ : ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కేశవ తెలియజేశారు. మంగళవారం కోర్టులో డిఎస్‌పి చైతన్య, అర్బన్, రూరల్ సిఐలు నరసింహారావు, పుల్లయ్య అర్బన్, రూరల్ ఎస్ఐలు, చిట్వేలి, పుల్లంపేట, నందలూరు ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని పోలీసులకు సూచించారు. పరిష్కారంకాని సివిల్ కేసులకు స్టాంప్ డ్యూటీ తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు. నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకున్న వారికి కాలం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించబడిన కేసులకు అప్పీల్ ఉండదని, లోక్ అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని పేర్కొన్నారు.

రోడ్డెక్కిన టమోటా రైతులు

- జాతీయ రహదారిపై రాస్తారోకో
- రెండు గంటల పాటు స్తంభించిన రాకపోకలు
- మార్కెట్ యార్డ్‌కు తాళాలు వేసిన రైతులు
- మార్కెట్ యార్డ్ చైర్మన్ హామీతో నిరసన విరమణ



రైతుల రాస్తారోకోతో ఆగిపోయిన వాహనాలు

ప్రజాశక్తి-గుర్రంకొండ

గిట్టుబాటు ధర కల్పించాలని, జాక్‌పాట్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టమోటా రైతులు రోడ్డెక్కారు. మంగళవారం సాయంత్రం మార్కెట్ యార్డ్ వద్ద కడప-బెంగళూరు ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వందలాది వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులలో నిరసన విరమించే ప్రయత్నం చేశారు. పోలీసులకు, రైతులకు వాగ్వివాదం జరిగింది. మార్కెట్ యార్డ్‌కు రైతులు తాళాలు వేశారు. కలెక్టర్ వచ్చేంత వరకు నిరసన విరమించేది లేదని రైతులు రోడ్డుపైనే బైటాయించారు. మండీ యజమానులు, వ్యాపారుల దోపిడీ నుంచి టమోటా రైతులను రక్షించాలని నినాదాలు చేశారు. మదనపల్లె మార్కెట్ కంటే గుర్రంకొండ మార్కెట్‌లో 60 శాతం తక్కువ రేటుకు టమోటాలు కొనుగోలు చేస్తున్న విధానంతో రైతులు నష్టపోతున్నారని నినదించారు. మార్కెట్ యార్డ్‌ను తక్షణం మూసివేయాలని, ఎంపీ మిథున్‌రెడ్డికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటి పలు మార్లు ఆందోళనలు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాక్‌పాట్ పేరుతో 100 కిరిట్ల టమోటాకు 20 కిరిట్లు ఉచితంగా మండి యజమానులు తీసుకుంటున్నారని రైతులు వాపోయారు. మండి యజమానులు నాలుగు శాతం కమిషన్ తీసుకోవాలని, పది శాతం తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్‌లో మాత్రం బోర్డుపై నాలుగు శాతం అని ఉందన్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మదనపల్లి మార్కెట్‌లో నిల్వ ఉన్న టమోటాలు రూ.150 పలికితే గుర్రంకొండ మార్కెట్లో రూ.వంద కంటే తక్కువ రేటును నిర్ణయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం పెట్టుబడి కూడా రాకపోగా కూలీలు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు ఒకసారి కిలో టమోటా రూ.25 పైసలు కూడా పడటం లేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రాస్తారోకో చేస్తున్న మార్కెట్ చైర్మన్ రవికుమార్, కార్యదర్శి జగదీష్ అక్కడికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. మీ న్యాయమైన కోర్కెలను నెల లోపల పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారి హామీతో రైతులు రాస్తారోకోను విరమించారు.



మార్కెట్ యార్డ్‌కు వేసిన తాళాలు పగులగొడుతున్న అధికారులు

'వినతుల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి'

ప్రజాశక్తి - రాయచోటి

సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ గిరీష ఆదేశించారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుంచి కలెక్టర్ గిరీష, ఎస్పీ గంగాధర్ రావు, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించాలనే ఉద్దేశంతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారన్నారు. కార్యక్రమాన్ని జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. మండల స్థాయి అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తే 80 శాతం సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని చెప్పారు. సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు అందరూ పని చేయాలన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి సమస్యలున్నా తెలియచేయవచ్చు అన్నారు. సంక్షేమ పథకాలు, వైఎస్ఆర్ పెన్షన్ కానుక, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ సేవలు పొందడంలో ఏమైనా అవాంతరాలు ఎదురైతే ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఏమైనా సమస్యలున్నా, ప్రభుత్వ సేవలకు సంబంధించి మరే ఇతర ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారం కోసం 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడూ తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుంటుందన్నారు. జిల్లాలోని ప్రజలందరూ 'జగనన్నకు చెబుదాం' 1902 టోల్ ఫ్రీ నెంబర్ ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గిరీష, ఎస్పి గంగాధర్‌రావు

మూఢ నమ్మకాలను విడనాడాలి : జెవివి



వేసవి వినోదం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

మూఢనమ్మకాలను వీడనాడాలని జెవివి రాష్ట్ర కమిటీ అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో జెవివి ఆధ్వర్యంలో వేసవి వినోదం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులందరూ శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు. వేసవిలో కూల్‌డ్రింక్స్ తాగరాదని సూచించారు. శీతల పానీయాల వల్ల గొంతు, ఉదర సంబంధిత సమస్యలొస్తాయని చెప్పారు. రసాయనాలు కలిపిన శీతల పానీయాలకంటే కొబ్బరినీళ్లు, మజ్జిగ లాంటి సహజ పానీయాలు తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. అనంతరం వేసవి వ్యాధులు, నివారణ మార్గాలు కరపత్రాలను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు చక్రపాణికి విద్యార్థులకు మొక్కల భాగాలను చూపిస్తూ వాటి పనితీరును ఆసక్తికరంగా వివరించారు. మొక్కల పునరుత్పత్తి ఎన్ని విధాలుగా ఉంటుందో క్షణంగా వివరించారు. కార్యక్రమంలో 40 మంది పిల్లలు పాల్గొన్నారు. పదిరోజుల పాలు కార్యక్రమాల కొనసాగుతాయని ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రకాశ్ రెడ్డి, భయ్యా రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి, పాల్గొన్నారు.

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత పెంచాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఆయా శాఖల జిల్లా సంక్షేమ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ గిరీష ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల ఫలితాల్లో 50 శాతం మాత్రమే రావడంతో సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కెజిబివి, సోషల్ వెల్ఫేర్, తదితర గురుకులాల ప్రిన్సిపల్‌తో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు బెస్ట్ టీచర్లతో స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. వంద శాతం విద్యార్థులు స్పెషల్ క్లాసులు హాజరయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎంతో ఖర్చు పెడుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోతే ఎలా?, మీ పిల్లలు ఫెయిల్ అయితే అలాగే ఉంటారా? ప్రతి ఒక్కరు పరీక్షకు హాజరు అయ్యేలా చూడడంతో పాటు సప్లమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత కావాలని సూచించారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ఇంపార్టెంట్ కోషన్లతోపాటు తగు సూచనలు ఇవ్వాలన్నారు. సప్లమెంటరీ పరీక్షల్లో ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు, ఏరోజుకారోజు రిపోర్టు ఇవ్వాలని డిఇఒను ఆదేశించారు. ఎస్‌డిజి గోల్స్‌లో భాగంగా ప్రతి విద్యార్థీ చదువును మధ్యలో నిలిపివేయకుండా ఇంటర్‌లో ఏదో ఒక ఒకేషనల్ కోర్సు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంటర్ తర్వాత చాలామంది విద్యార్థులు చదవటం లేదన్నారు. విద్యార్థుల చదువు పైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సబ్జెక్టు టీచర్ సరిగా చెప్పకపోతే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. బెస్ట్ టీచర్స్ ఎవరైతే ఉన్నారో వారితో స్పెషల్ క్లాస్ చెప్పించాలన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుతున్నారా లేదా గమనించాలని, వారి భవిష్యత్తును బంగారు బాట వేసేందుకు ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. తాను చదివింది కూడా ప్రభుత్వ పాఠశాల అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాలన్నారు. పెనగలూరు, పుల్లంపేట, గాలివీడు, ఓబులవారిపల్లి తదితర మండలాల్లోని కెజిబివి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో జీరో పర్సంటేజ్ రావడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి సప్లమెంటరీ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ మంచి మార్కులు తెచ్చుకునేలా బోధన చేయాలన్నారు. సమీక్షలో డిఐఇఒ కృష్ణయ్య, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మరియు సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, కెజిబివి సోషల్ వెల్ఫేర్, గురుకులాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.




మదనపల్లె : ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రాంగణ ఎంపికల్లో 130 మందికి ఉద్యోగాలు

మదనపల్లె అర్బన్: స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాలలో ప్రముఖ బహుళ జాతి సంస్థ సుందరం ఫాసనర్స్ లిమిటెడ్ (టివిఎస్) సంస్థ నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో 130 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల కరెస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఫైనల్ ఇయర్ బిఎస్సి, బికాం కోర్సులకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, వీరిలో ప్రతిభ కనబరిచిన 130 మందిని ట్రైనీ ఇన్ ప్రొడక్షన్, క్వాలిటీ చెకింగ్ ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. వీరికి చెన్నైతో పాటు శ్రీ సిటీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ప్రతి నెలా రూ.15,750 వేతనంతో పాటు అలవెన్సెస్ ఇస్తారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్ అభినందించారు.

పీలేరు: ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జరిగిన ప్రాంగణ ఎంపికలో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని హైదరాబాదు టాటా స్ట్రైవ్ కంపెనీ హెచ్‌ఆర్ అఖిల్ గౌడ్ తెలిపారు. మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ ఎంపికలను మూడు దశల్లో నిర్వహించామని పేర్కొన్నారు. మొదట రాత పరీక్ష రౌండులో 60 మంది విద్యార్థులు పాల్గొని 34 మంది రెండవ, మూడవ దశ సామూహిక చర్చలు, హెచ్‌ఆర్ రౌండులో పాల్గొని 15 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2.5 లక్షల వేతనం ప్యాకేజీగా పొందుతారని కంపెనీ హెచ్‌ఆర్ చెప్పారు. ఈ సందర్భంగా ఎంజెఆర్ కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, అధ్యాపక బృందం ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జీలు మధులిక, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పీలేరు : ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక వాడాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జాగ్రత్తలతో మన ప్రాణాలను మనమే కాపాడుకుందామని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు తదితర వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలన్నారు. చిన్న వయసులోనే వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మోటర్ సైకిల్‌పై వెళ్లే వారు హెల్మెట్‌ను కచ్చితంగా వాడాలని, వాహనాలకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కొంత మంది సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ.. ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పరిమితికి మించిన వేగంగా వాహనాన్ని నడపకూడదని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనదారులు సహకరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి చేస్తే వాహన యజమాని, తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వస్తోందన్నారు. ఇక మీదట వాహనాలు నడిపేటప్పుడు తమ వాహనాలకు సంబంధించిన వాహనాల రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, లైసెన్సులు, రికార్డులు లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కారులో వెళ్లేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా అసాంఘీక కార్యక్రమాలు, అక్రమ రవాణాలు జరిగినా వెంటనే తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

12న మెగా జాబ్‌మేళా

రాయచోటి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 12న ఉదయం 9 గంటలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటన పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనుచున్నాయని, వాటి ద్వారా జిల్లా లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, కియా మోటార్స్, ముతూట్ ఫైనాన్స్, కోజెంట్ తదితర బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనుచున్నాయ న్నారు. జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ,యువకులు విద్యార్హతలు పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ,డిప్లొమా, డిగ్రీ , బి.టెక్, పి.జి చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని, జాబ్ మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ. 30 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8897776368, 7799587687లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్‌కు 13 అవార్డులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె 2021-22లో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డుల పంట పండింది. మంగళవారం సొసైటీ కాలనీలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లయన్స్ క్లబ్ ఎడిసిఎస్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ కర్ణాటక రాజధాని, బెంగళూరు నగరంలోని కోరమంగళ క్లబ్ కన్వెన్షన్ హాల్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగిందన్నారు. సేవా కార్యక్రమాలను ప్రామాణికంగా తీసుకొని ఈ అవార్డులను అందజేసినట్లు తెలిపారు. జిల్లాలోని బెస్ట్ రూరల్ క్లబ్ అవార్డు, బెస్ట్ విజన్ కేర్ అవార్డు, బెస్ట్ హంగ్ రిలీఫ్ అవార్డు, బెస్ట్ లయన్స్ ఐ హాస్పిటల్ అవార్డుతోపాటు పశువైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాల ఏర్పాటు చేసినందుకు మొత్తం 13 అవార్డులను అందుకొని జిల్లాలోని మొదటి స్థానం నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఇన్ని అవార్డులు కైవసం చేసుకోవడం జిల్లాలోనే ఇదే ప్రథమమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన లయన్స్ ఇంటర్నేషనల్ లీడర్షిప్ అవార్డును ఎడిసిఎస్ లయన్ గౌతమ్‌రెడ్డి అందుకోవడం గర్వకారణమన్నారు. లయన్స్ క్లబ్ సేవలు గ్రామ, గ్రామాన విస్తరించడమే లక్ష్యమన్నారు. అంధత్వ నివారణే లక్ష్యంగా వేలాది మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించడం జరిగిందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి మరిన్ని అవార్డులను కైవసం చేసుకోవడం తమ ముందున్న ఏకైక లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు లయన్ మార్పూరి మహేష్, లయన్స్ సర్వీస్ ట్రస్ట్ సెక్రటరీ లయన్ కెఎస్ఎస్ ప్రసాద్, ఎడిసిటి బాబూలాల్ భండారీ, లయన్ భాస్కర్ నాయుడు, లయన్ లియో భవేష్ పాల్గొన్నారు.



అవార్డులను చూపిస్తున్న గౌతమ్‌రెడ్డి

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ వేంపల్లి దళితవాడలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ పెద్ద బైనేని నరసింహులు, బండకోట వెంకటరమణ, ఆవుల వెంకటరమణ, బైనేని రఘు, వేంపల్లె రవిల సంయుక్త ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.అర్.అంబేద్కర్ ఆలోచన, ఆశయాల స్ఫూర్తితో అంబేద్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో దళితవాడ ప్రజలు పెద్దలు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. భారతరత్న డాక్టర్ బి.అర్.అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సమాజంలోని అసమానతలను తొలగించేలా, చట్టాలను రాజ్యాంగంలో పొందు పరిచిన మహా మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, బహుముఖ ప్రజ్ఞాశాలి సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలనలో ఆ మహనీయుడు సమాజానికి దిక్సూచి అని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అయన చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకి ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో రవి, వేంపల్లి యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ గిరీష

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

బాగా చదువుకొని ఉన్నతి శిఖరాలు అధిరోహించాలని 10 పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ గిరీష తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్లో కె.వి పల్లి మండలం ఎపి మోడల్ స్కూల్ పదో తర గతి విద్యార్థులు 10 పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించడంతో కలెక్టర్ ఆ విద్యార్థులను అభినందించారు. సౌమ్యశ్రీ 586, కె.రెడ్డి భవ్య శ్రీ 571, ఎ.ముని ప్రసన్న 570, కే రుచిత 565 మార్కులు రావడంతో వారికి జ్ఞాపికను కలెక్టర్ అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ చదువును మధ్యలోనే నిలిపివేయకుండా ఆరు సంవత్సరాల వరకు బాగా కష్టపడితే కలెక్టర్ అవుతారని, లక్ష్యం పెట్టుకొని ఇప్పటినుంచే బాగా చదవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, ఆపై ఉన్నత చదువులు చదివి సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కె.వి.పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా నగరవనం నిర్మాణం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సందర్శకులకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం అందించేలా నగరవనం నిర్మాణాలను చేపడతామని వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పట్టణానికి కూతవేటు దూరంలో ఎగువ అబ్బవరం సమీపంలో 76 ఎకరాల సువిశాల స్థలంలో నిర్మితమవుతున్న నగరవనం నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, అటవీ, రెవెన్యూ అధికారులుతో కలసి శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. నగరవనం నిర్మితం కానున్న ప్రాంతాలను ఆయన కలియ తిరిగారు. ఇందులో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్,ప్లే ఏరియా, కమ్యూనిటీ హాల్, కేఫ్, బాత్ రూమ్స్, వాచ్ టవర్, కంచాలమ్మ గండిలో బోటింగ్ తదితర నిర్మాణాలపై ఆటవీశాఖాధికార్లతో చర్చించారు. నాలుగు నెలల్లో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. సందర్శకుల అందమైన కలలకు మరో రూపంలా నగరవనాన్ని తీర్చిదిద్దుతామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ రఘు శంకర్, తహశీల్దార్ ప్రేమ్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కరీముల్లా బాష, వైఎస్ఆర్ సిపి యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, అశోక్, వాల్మీకి సంఘ అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, కో-ఆప్షన్ హజరత్ ఖాదర్‌వలిపాల్గొన్నారు.

మణికంఠ రాథోడ్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - రాయచోటి

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున కార్గేపై ఇటీవల ఎన్నికల్లో చిత్తూరు బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ రాథోడ్ తనని, తన కుటుంబాన్ని హతమారుస్తామని బెదిరిస్తూ ఆడియో విడుదల చేశారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని రాయచోటి కాంగ్రెస్ నాయకులు ఎస్.అల్లాబకాష్ ఆధ్వర్యంలో డిఎస్‌పికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతయ్య, జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షుడు చెన్నకృష్ణ, జిల్లా జనరల్ సెక్రెటరీ ఖదీర్, లక్ష్మీ యాదవ్ పాల్గొన్నారు.



డిఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు


కోమటివాని చెరువు కట్ట రహదారి

రక్షణగోడకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ పరిధిలోని కోమటివాని చెరువు కట్టమీద రహదారికి ఇరువైపుల ఉన్న రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గొల్లపల్లి శివరవి రావు పేర్కొన్నారు. చెరువు కట్టకు ముందు ఇరువైపుల బలమైన పైపులు బిగించడం వల్ల ప్రమాదవశాత్తు ఏ వాహనమైన అదుపు తప్పినా చెరువులోకి గాని ఇటు కట్ట కిందికి గాని పడిపోకుండా రక్షణ గోడలు కాపాడు తుండేవని అన్నారు. కొంతకాలం తెలియని వ్యక్తులు కట్టమీద రోడ్డుకు ఇరువైపుల ఉన్న స్తంభాల మధ్యలో అమర్చిన పైపులు చాలా వరకు తొలగించడానికి అవకాశం తొలగించడం వల్ల ప్రమాదం జరిగే అవకాశాలే గాక వాహనదారులకు ప్రాణ నష్టము జరిగే ఆస్కారం ఉందన్నారు. వాహనదారుల ప్రాణ రక్షణ కోసం వెంటనే ఇరువైపుల స్తంభముల మధ్యలో పైపులు అమర్చి, వాటిని తొలగించడానికి అవకాశం లేకుండా వెల్డింగ్ చేయాలని అధికారులను కోరారు. కట్టపైనున్న రోడ్డును వన్‌వే మార్చి వాహనాలు రావడానికి, కట్టకింద తారురోడ్డుపై వాహనాలు పోవడానికి వీలుగా చర్యలు అధికారులు ఆదేశించాలని ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఆర్‌డిఒ, డిఎస్‌పి, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్లను కోరారు.

ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఏపి మోడల్ స్కూల్లో 2023-24 విద్య సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో పూర్తి చేసుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈనెల 9వ తేదీ నుండి 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పూర్తిచేసిన దరఖాస్తులను పాఠశాలలో ఇవ్వాలన్నారు. జూన్ 11న ఆన్‌లైన్లో రాత పరీక్ష ఉంటుందని ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థుల ప్రతిభను బట్టి అడ్మిషన్ చేసుకుంటామని తెలిపారు. సీట్ల విషయంలో ఎటువంటి పైరవీలను నమ్మవద్దని స్పష్టం చేశారు. మండల ప్రజలు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. **కురబలకోట :** మండలంలోని ఏపి మోడల్ స్కూల్ నందు 6 వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ యోజన గాంధీ అన్నారు. 5వ తరగతి చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని, పత్రాలను పాఠశాలలో సమర్పించాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.75, ఒసి, బిసిలకు రూ.150 రుసుం చెల్లించాలని అన్నారు. దరఖాస్తులు ఈనెల 25 వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. **రామాపురం :** మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్యామలాదేవి అన్నారు. ఐదవ తరగతి చదువుతూ ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష ఉంటుందన్నారు. ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి సిబిఎస్ సిలబస్‌లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలోని హరిహరాలయం దగ్గర ఏర్పాటు చేసిన మహాభారత యజ్ఞ కార్యక్రమంలో ఆరవరోజు డాక్టర్ బత్తల వెంకటరమణ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి టిడిపి మాజీ పాలకమండలి సభ్యులు సుగావసి ప్రసాద్‌బాబు లు పాల్గొని అన్నదానం చేశారు. మహాభారత యజ్ఞ కమిటీ సభ్యులు గడికోట ద్వారకనాథ్‌రెడ్డి, సుగావసి ప్రసాద్ బాబులను శాలువాతో సత్కరించి స్వామి వారి ద్వారకనాథ్‌రెడ్డి , ప్రసాద్‌బాబులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు సాయి డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ బుధ వారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉద్యోగ మేళాలో టెక్ మహీంద్రా, డిక్సన్, ఎన్‌ఎస్ ఇన్ఫోటెక్, 3.5 లైఫ్, లోన్ మంత్ర బ్యూ స్టార్, భారత్ ఫిట్, ఎయిర్టెల్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్‌తో పాటు 18 ప్రముఖ కంపెనీలు పాల్గొని వెయ్యి మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ సుబ్బరాయుడు హాజరవు తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కలికిరి

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జరిగే పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్-23 ప్రవేశ పరీక్షలు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కలికిరి నందు ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో 1180 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు రావాలని, 11 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరని తెలిపారు. పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కలికిరి, సీతారా డిగ్రీ కాలేజ్ పీలేరు రోడ్డు, ఇండియన్ పబ్లిక్ స్కూల్, ఎంజెపిఎపిబిసి వెల్ఫేర్ స్కూల్ మదనపల్లె రోడ్డు, పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ టెకలోన కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారని విద్యార్థులు హాల్ టికెట్లతో పెన్సిల్, రబ్బరు, పెన్ను వెంట తెచ్చు కొని పరీక్ష కేంద్రాలకు రావాలని ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమ తించరని స్పష్టం చేశారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా హుమయూన్

ప్రజాశక్తి-పీలేరు


మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన హుమయూన్

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా పీలేరు మాజీ సర్పంచ్ హుమయూన్ నియమి తులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హుమయూన్ 20 సంవత్సరాలుగా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డికి అనుచరుడిగా ఉన్నారు. 2001 నుంచి 2007 వరకు, 2013 నుండి 2018 వరకు పీలేరు గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా స్థానిక ప్రజలకు సేవలందించారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులుగా, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గుర్తించి వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా హుమయూన్ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలను కృతజ్ఞతలు తెలుపుకున్నారు. పార్టీ ఆదేశానుసారం పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

ఉపాధి కూలీలను ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : వేసవి దృష్టిలో ఉంచుకొని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు వేసవిలో మజ్జిగ మంచినీళ్లు మెడికల్ కిట్లు ఇవ్వాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి సిద్ధిగల శ్రీనివాస్ పేర్కొన్నారు. పనిచేసే ప్రదేశాలలో మస్టర్ కొనసాగించాలని జాతీయ మొబైల్ మానిటరింగ్ సిస్టమును అమలు చేయడం మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

గర్భిణులు వైద్యుల సూచనలు తప్పక పాటించాలని డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మహేష్ తెలిపారు. మండల పరిధిలోని అనంతంపల్లె గ్రామంలో రోగులకు వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మెరుగైన వైద్యం నోచుకోని వారికి కూడా ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. రోగికి చికిత్సతో పాటు మందులను పంపిణీ చేసి ఆరోగ్య సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయానికి నెలకు రెండుసార్లు 104 వాహనం అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. 67 రోగాలకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రోగికి అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఉన్నత ఆస్పత్రికి పంపించడం జరుగుతుందని తెలిపారు. బిపి, షుగర్, యూరిన్ పరీక్షలు చేస్తున్నామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ, నాగజ్యోతి, ఎఎన్ఎం సరస్వతి, ఆశా వర్కర్ రాధమ్మ, రమణమ్మ, గ్రామస్తులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం గర్భిణులకు ఒక వరం లాంటిదని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి నెల 9వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రక్తపరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్నవారిని గుర్తించి అంగన్వాడీ కేంద్రాల పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్ జవహర్‌బాబు మాట్లాడుతూ ప్రతి గర్భిణి ఎంపిసి కార్డును క్షుణ్ణంగా చదువుకోవాలని, టీకాలు, మందులు సకాలంలో తీసుకోవాలన్నారు. గర్భిణి పరిస్థితిని బట్టి మరిన్ని పరీక్షల నిమిత్తమై స్కానింగులు, టిపాస్కాన్లు చేయించుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ కేంద్రంలో కాన్పు అయ్యేటట్లు చూడాలన్నారు.కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒజి జయరామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్నమ్మ, సూపర్వైజర్ షేక్ ముజీబ్‌బాషా, బి.రెడ్డమ్మ, స్టాఫ్ నర్స్ భారతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు వాణి, శ్రీలక్ష్మి, భాగ్యమ్మ ఎంఎల్‌హెచ్‌పి రాజ సులోచన, గోపికృష్ణ, లావణ్య, అశ్విని, కనకమ్మ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** గర్భవతులు వైద్యుల సూచనలు తప్పక పాటించి, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ నాయక్ అన్నారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖ బేగం ఆదేశాల మేరకు స్థానిక పిహెచ్‌సి లో వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ నాయక్ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఎ) కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మల్లిక, పబ్లిక్ హెల్త్ నర్స్ జే.సరోజ, హెల్త్ సూపర్వైజర్ దేవకుమారి, ఎంపిహెచ్ఇఒ రామచంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ నాగేంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు :** తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అధిక రక్తపోటు, మధుమేహం, హెచ్‌బి శాతం పరీక్షలు నిర్వహించారు. బరువు, ఆరోగ్య స్థితినిబట్టి గర్భిణులకు సూచనలు, సలహాలతో పాటు ఐరన్ ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలు పంపిణీ చేసి, ఆరోగ్య పరీక్షల ఆవశ్యకత, ఆస్పత్రిలో కాన్పుల ప్రాముఖ్యతను క్లుప్తంగా డాక్టర్ వారికి వివరించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ వెంకట సుబ్బమ్మ, స్టాఫ్ నర్సులు లక్ష్మి, అనిత, శిరీష, శ్రీలక్ష్మీ, ఏఎన్ఎం నాగవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక కోసవారిపల్లి పిహెచ్ఎస్‌సిలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సి.మునికుమార్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేసుకోవాలని పిఎంవివివై పథకం కింద రూ.6వేలు పౌష్టికాహారం కోసం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుమతి, ఎంపిహెచ్ఇఒ టివి.రమణ, పి హెచ్ ఎన్ కె.సుమలత, ఎంపిహెచ్ఎస్ పి.లలితమ్మ, ఆశ కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది కె.పర్వీన్, రెడ్డికుమారి పాల్గొన్నారు.


నిమ్మనపల్లి : గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ భానుప్రకాష్ నాయక్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడటం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 34 వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ముందుకు పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని తెలుసు కోవడం తోపాటు సమస్యలను గుర్తించి వాటిని పరి ష్కరించడం కోసమే ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా గడప గడపకు మన ప్రభుత్వ కార్య క్రమాన్ని ముందుకు తీసుకువెళ్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

జనుపువార్లపల్లి రోడ్డుకు మహర్ధశ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధికి చాలా దూరంలో ఉన్నటువంటి ఐదవ సచివాలయం పరిధిలో జనుపు వార్లపల్లి 3.5 కిలో మీటర్లు ఉంది. ఎంతోమంది నాయకులు వచ్చారు..పోయారు గానీ ఇచ్చిన హామీని మాత్రం మరచి పోయారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఇచ్చిన మాట కట్టుబడి జనుపువార్లపల్లి రోడ్డు వేయించి ప్రజలకు అందు బాటులోకి తెచ్చారు. సుమారు రూ.1.37 కోట్లతో అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతగా రోడ్డు వేయించేందుకు చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి జనుపువార్లపల్లి శ్రీనివాసులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.


జనుపువార్లపల్లికి వేసిన రోడ్డు

పెద్దకాలప్పను పరామర్శించిన 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలోని అగ్రహారం గ్రామం, కంభ మిట్టపల్లిలో అనారోగ్యం తో బాధపడుతున్న మాజీ ఉప సర్పంచ్ పెద్ద కాలప్పను మంగళవార టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. మధుమేహ వ్యాధితో బాధపడుతూ కాళ్లు కోల్పోయి, చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన కాలప్పను, కిషోర్ కుమార్ రెడ్డి అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని పార్టీ మీకు ఎప్పుడు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆ గ్రామ మహిళలు పలు సమస్యలను కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతానని, అధైర్య పడవద్దనీ, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీలేరు మండల నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు, అగ్రహారం గ్రామస్తులు పాల్గొన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న కిషోర్ కుమార్ రెడ్డి

బడుగుల సంక్షేమానికి పెద్దపీట : గడికోట

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దళితోద్ధారకుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ అని వైసిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి మున్సిపల్ పరిధిలోని11వ సచివాలయం 17వ వార్డులో పాదలపల్లె, ఎగువ అబ్బవరం మాలపల్లె, 24 సచివాలయం 3 వార్డులలో ఉదయం 6 గంటలకే గడప గడపకు మన ప్రభుత్వం కార్య క్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, ప్రజా సమస్యలపై ఆరా తీస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, స్థానిక కౌన్సిలర్లు చంద్రశేఖర్, జ్యోత్స్న యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మదన మోహన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, ఆయన్న, గోపాల్ రెడ్డి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, నేలపాటి వెంకటేష్, కొలిమి ఛాన్ బాష, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, అన్నా సలీం, కో ఆప్షన్ హజరత్ ఖాదర్ వలీ,మాజీ కౌన్సిలర్ రామయ్య, అశోక్ పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

మండల, గ్రామ సమాఖ్యల పనితీరు భేష్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో అమలవుతున్న వైఎస్ఆర్ క్రాంతి పథం మండల, గ్రామ సమాఖ్యల పనితీరు భేష్ అని ఆడిటర్ గౌతమ్ సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం శ్రీ శక్తి భవన్‌లో మండల సమైక్య, గ్రామ సమైక్యల పనితీరు, ఏప్రిల్ 22 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన బ్యాంక్ లావాదేవీలు పుస్తక నిర్వహణ తదితరాలపై ఆడిట్ నిర్వహించారు. సమైక్యల పనితీరు బాగుండడంతో మహిళల్లో మహిళా సంఘాలు పటిష్టమై మంచి ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఆడిటింగ్ మూడు రోజులు ఉంటుందన్నారు. కార్యక్రమంలోఎపిఎం గంగాధర్ పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ప్రజలు

శ్రీబోయకొండ గంగమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని అమ్మచెరువు దోభిఘాట్ వద్ద వెలసిన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జాతర వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శ్రీరామ రజక కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కె.వెంకటరమణ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకలకు ముఖ్య అతిధిగా రజక సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు ముసలి కుంట నాగయ్య హాజరయ్యారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పాలాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం గొల్లపల్లి రింగ్ రోడ్డు నుండి అమ్మవారి భక్తులు దీలు, బోణాలను ఆలయానికి ప్రదర్శనగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా కె.వెంకట రమణ, ముసలికుంట నాగయ్యలు మాట్లాడుతూ ప్రతి ఏటా అనవాయితీగా ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే జాతరకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి ని దర్శించుకొని, తీర్థ, ప్రసాదాలు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వేమనారాయణ, చంద్రా, రామకృష్ణ, ఈశ్వరయ్య, నరసింహులు, విజయ, రమణ, నాగరాజు, కె.రమణ శేఖర్‌తోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం

పోరుమామిళ్ల టౌన్ : బి కోడూరు మండలం గొడుగునూరు గ్రామానికి చెందిన పూజిత అనే గర్భిణికి ఎ పాజిటివ్ రక్తం అవసరం కాగా ఆమె బంధువులు రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్ట్ వ్యవ స్థాపకులు నాయబ్ రసూల్ స్పందించి పోరుమామిళ్లకు చెందిన నారా యణచే మంగళవారం రక్తదానం చేయించారు. అడిగిన వెంటనే స్పందించి దాతకు, ట్రస్టు వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యార్థులకు కథల పోటీలు

పోరుమామిళ్ల : పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించనున్నామని గ్రంథా లయాధికారి ఆఫ్రిద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పేర్కొన్నారు. మంగళవారం గ్రంథాలయంలో విద్యార్థులతో దినపత్రికలు, కథల పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసక్తి గల విద్యార్థులు నీతి, పురాణ కథలతోపాటు తమకు నచ్చిన కథలు స్పష్టంగా పాఠకులకు అర్థమయ్యే రీతిలో చెప్పాలన్నారు. తెలుగు అధ్యాపకులు మహ్మద్ రఫీ విద్యా ర్థులకు క్విజ్ పోటీలు నిర్వమించి విజేతలకు బహుమతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రేవంత్, మోక్షిత, చరణ్, మాహినూర్, తస్లీమ్ పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

పోరుమామిళ్ల : పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో నీటి సరఫరా అందించే మెయిన్ పైప్ లైన్ పగిలిపోవడంతో మేజర్ పంచాయతీ ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ప్రజలకు ఎటువంటి నీటి అసౌకర్యం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఆయనే దగ్గరుండి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ పరిధి ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విధి నిర్వ హణలో నిర్లక్ష్యం చేయకుండా పనితీరు మెరుగుపరుచుకోవాలని ఎంపిడిఒ ఆనంద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో టోల్ నెంబర్ 1902 పై ప్రజల కు అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరిం చాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి జవహర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేటలో జగనన్నకు చెబుదాం..

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టారని స్థానిక వైసిపి నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట గ్రామ సచివాలయంలో సిఎం జగన్ ప్రసంగాన్ని టివి ద్వారా ప్రజలకు చూపించారు. కార్యక్రమం లో అప్పయ్యారాజుపేట ఉప సర్పంచ్ సయ్యద్ ముస్తాక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1902 గురించి ప్రజలకు బాగా అవగాహన కల్పించాలని వాలంటీర్లను, కార్యదర్శులను కోరారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రజలు 1902 కు ఫోన్ చేయకముందే వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, సచివాలయ సిబ్బంది రైతు భరోసా సిబ్బంది, వాలంటీర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


తహశీల్దార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

తహశీల్దార్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-నందలూరు

అన్నమయ్య డ్యాం గేట్లు తెగిపోవడం వల్ల సంభవించిన వరదల్లో తహశీల్దార్ ఉదయ శంకర్‌రాజు సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటేషన్ పై లక్కిరెడ్డిపల్లె తహశీల్దార్‌గా వెళుతున్న ఉదయశంకర్‌రాజు వీడ్కోలు సభ నిర్వహించారు. అనంతరం ఆయనను అధికారులు, రాజకీయ నాయకులు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, టిడిపి నాయకులు మోడపోతుల రాము, గౌడ సంఘం నాయకులు తుమ్మల శ్రీధర్ గౌడ్, డిప్యూటీ తహశీల్దార్ మోహన్, ఆర్ఐ రామాంజనేయులు, మండల సర్వేయర్ ఓబయ్య, సీనియర్ అసిస్టెంట్ భారతి, విఆర్ఒలు చంద్రశేఖర్ రాజు, రాఘవ విఆర్ఎలు, మండలంలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా జవహర్‌బాబు

తంబళ్లపల్లి : మండలంలోని పంచాయతీరాజ్ ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఇఒపిఆర్‌డిగా జవహర్‌బాబు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మొలకలచెరువు ఇఒపిఆర్‌డిఒ ఉండగా డిప్యూటేషన్‌పై తంబళ్లపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందుబాటులో ఉండి, సకాలంలో మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

క్రైం కార్నర్

రామ్‌నగర్‌లో భారీ చోరీ

రూ.7 లక్షల నగదు, 4 తులాలు బంగారం అపహరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


దొంగలు పగలగొట్టిన బీరువా

పట్టణంలో దుండగులు మరోసారి భారీ చోరీకి పాల్పడ్డారు. రామ్‌నగర్‌లో నివాస ముంటున్న బట్టల వ్యాపారి చెంద్రాయుడు కుటుంబ సమేతంగా రెండు రోజులు క్రితం సుండుపల్లెలో జరుగుతున్న జాతరకు వెళ్లారు. తిరిగి సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి తలుపు బద్దలై ఉండడం చూసి ఇంట్లోకి వెళ్ళగా బీరువా పగులగొట్టి ఉండటం గమనించారు. బీరువాలో స్థలం కొనాలని దాచుకున్న రూ.7 లక్షల నగదుతో పాటు నాలుగు తులాల బంగారం, విలువైన చీరలు చోరీకి గురైనట్లు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసు జాగిలంతో ఘటనా స్థలంలో దర్యాప్తు చేపట్టారు. వేలి ముద్రలు, జాగిలం సాయంతో దొంగలను పట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు జరుగు తున్నాయి. పట్టణంలో ఇటీవల వరుస దొంగతనాలు ప్రజలను బెంబేలెత్తి స్తున్నాయి. ఆర్ఎస్ రోడ్డు, నలంద పాఠశాల వద్ద, వారం క్రితం సాయినగర్‌లో జరిగిన దొంగతనాలు మరువక ముందే నేడు రాంనగర్‌లో చోరీ ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇంటి నుంచి బయటికి వెళ్లాలన్నా, వేసవిలో ఆరు బయట నిద్రించాలన్నా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో జరుగుతున్న వరుస చోరీల పట్ల పోలీసులు అప్రమత్తమై ప్రత్యేక చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అక్రమ మద్యం కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారాను అక్రమంగా అమ్ముతున్న ఓ మహిళను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... తవళం గ్రామం కుమ్మరపల్లెకుకు చెందిన మల్లక్క నాటుసారాను అక్రమంగా విక్రయిస్తుండటంపై పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం తవళం కు సమీపంలో నాటు సారాను విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి ఆమెను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుండి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలు పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నాటుసారా తయారీ, విక్రయానికి పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు. **బి.కొత్తకోట :** అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపించినట్లు బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పట్టణం ఇందిరమ్మ కాలనీలో కిట్టన్న అనే వ్యక్తి తన కిరాణాషాపులో అక్రమంగా కర్ణాటక టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో దాడి చేయడం జరిగిందని, అతని వద్ద నుంచి 32 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2900ఉన్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యాన్ని విక్రయితే తమ దృష్టికి తీసుకరావాలని ప్రజలకు సూచించారు.